# ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

## ప్రసంగం

# శ్రీ ఇ.ఎస్.ఎల్.నరసింహన్

## ఆంధ్రప్రదేశ్ గవర్నరు

మాఘ బహుళ 11, 1937

5 మార్చి, 2016

**మాన్యశ్రీ అధ్యక్షా,**

**సభాపతి మహాశయా,**

**గౌరవనీయులైన శాసనమండలి సభ్యులారా!**

2016-17 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఉభయసభల మూడవ సంయుక్త సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించడం నాకు సంతోషంగా ఉంది.

మొదటగా, రాష్ట్ర విభజన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురైనప్పటికీ అభివృద్ధి మరియు సంక్షేమ రంగాలలో గణనీయమైన పనితీరు, అంచనాల మేరకు ప్రజల జీవన తీరుతో నా ప్రభుత్వం తన సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో ప్రశంసించదగిన పురోగతిని నమోదు చేసిందని తెలిపేందుకు సంతోషంగా ఉంది.

అశాస్త్రీయ రాష్ట్ర విభజన వల్ల నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాబడులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందనే విషయాన్ని సభకు తెలియజేస్తున్నాను. సమైక్య రాష్ట్రంలో జనాభా పరంగా 58 శాతం ఉండగా, రాబడుల పరంగా 46 శాతం మాత్రమే రాష్ట్రానికి అందిందన్న విషయాన్ని 14వ ఆర్థిక సంఘమే ధృవీకరించింది.

2014-15 ఆర్థిక సంవత్సరంలో వనరుల వ్యత్యాసాన్ని రూ.16,079 కోట్లుగా ఎ.జి. అంచనా వేయగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు మంజూరైన అడ్‌హాక్ గ్రాంటు రూ.2,303 కోట్లు. చాలా పెద్ద మొత్తంలో అంటే రూ.13,776 కోట్ల మేరకు మంజూరు అందవలసి ఉంది. అదేవిధంగా, రాష్ట్రంలోని 7 వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం గత రెండు సంవత్సరాలలో ప్రతి జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్ల గ్రాంటు అందింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చేర్చిన విధంగా మరియు పార్లమెంటులో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం పన్ను ప్రోత్సాహకాలు, నూతన రాజధాని అభివృద్ధి కోసం ఆర్థిక గ్రాంట్లు, నూతన రైల్వే జోను హామీ, జాతీయ ప్రాజెక్టుగా పోలవరానికి ఆర్థిక సహాయం మరియు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామనే మొదలైనటువంటి హామీలు ఇంకా నెరవేర్చవలసి ఉంది.

హుద్‌హుద్ తుఫానుతో ఆరంభమయి వరుసగా ఏర్పడిన ప్రకృతి విపత్తులు కూడా రాష్ట్రాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. వీటి వల్ల విశాఖపట్టణం బీభత్సంగా మారింది. దాదాపు రూ.70,000 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వెనువెంటనే చాలా జిల్లాలలో తీవ్ర అనావృష్టి మరియు నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వరదలు సంభవించాయి. అయినప్పటికీ, అనావృష్టి పరిస్థితులలో మా సమర్ధవంతమైన నీటి నిర్వహణను రైతు సమాజం ప్రశంసించటంతోపాటు, హుద్‌హుద్ తుఫానును, వరదలను ఎదుర్కోవడంలో నా ప్రభుత్వం చేసిన కృషికి దేశ నలుమూలల నుండి ప్రశంసలు రావడం హర్షించదగిన విషయం.

2015-16 ఆర్ధిక సంవత్సరంలో నిరంతర కఠోర శ్రమ మరియు అంకితభావంతో రాష్ట్రం రెండంకెల వృద్ధిని విజయవంతంగా సాధించగలదు. 2015-16 ముందస్తు అంచనాల ప్రకారం, తత్సమాన కాలంలో జాతీయ వృద్ధి 7.6 శాతంగా ఉండగా, స్థిర (2011-12) మార్కెట్ ధరలలో జిఎస్‌డిపి 10.99 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే సమయంలో జాతీయ వృద్ధి 7.3 శాతం ఉండగా, సమగ్ర స్థూల విలువ ఆధారిత (జివివి) వృద్ధి స్థిర (2011-12) ప్రాథమిక ధరలలో 10.50 శాతంతో రాష్ట్ర ప్రతిష్టను సడలించలేదు. అనావృష్టి ఉన్నప్పటికీ అనుబంధ రంగాల మద్ధతుతో వ్యవసాయ రంగం 8.40 శాతం వృద్ధిని నమోదు చేసింది. కాగా, తయారీ, సేవా రంగాలు వరుసగా 11.13 శాతం మరియు 11.39 శాతం నమోదు చేశాయి. మొదటిసారిగా తలసరి ఆదాయం రూ.1.07 లక్షలకు చేరడం హర్షించదగిన విషయం. మన రాష్ట్రాన్ని దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మరియు రాష్ట్ర ప్రజలు నాయకత్వంపై ఉంచిన అచంచల విశ్వాసం, నమ్మకాన్ని నిలబెట్టుకొనేందుకు వీలుగా వచ్చే ఆర్ధిక సంవత్సరంలో 15 శాతం వృద్ధి రేటును సాధించాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉండేలా చూడటానికి వచ్చే 14 సంవత్సరాల పాటు రెండంకెల వృద్ధిని కొనసాగించడం అనివార్యంగా ఉంది. మానవాభివృద్ధి అంశానికి ఆవల, సంతోష సూచికను పెంచడంపై మా దృష్టి కేంద్రీకరణ అయి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి పనితీరును చక్కగా కనబరుస్తున్న మూడు రాష్ట్రాలలో ఒకటిగానూ మరియు 2029 నాటికి అగ్రగామి రాష్ట్రంగానూ, 2050 నాటికి ప్రపంచంలోనే ఉత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంపై నా ప్రభుత్వం దృష్టిసారించింది.

నా ప్రభుత్వం ఉపరితల మరియు భూగర్భ జల వనరులను ఒక ప్రభావవంతమైన విధానం ద్వారా అభివృద్ధి పరచడం, సంరక్షించడం, వినియోగించడం ద్వారా కరవు రహిత రాష్ట్రంగా వుంచడానికి కృషి చేస్తున్నది. వర్షాకాలం ముందు దాదాపు 8 మీటర్లకు వర్షాకాలం తరువాత దాదాపు 3 మీటర్లకు భూగర్భ జల స్థాయిని పెంచాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో నా ప్రభుత్వం పనిచేస్తున్నది. పంట సంజీవిని క్రింద కరవు కాలాలలో జీవనాధార సాగు కోసం సాగునీటిని సమకూర్చడానికిగాను 8.75 లక్షల సాగు కుంటల భారీ నిర్మాణ కార్యక్రమాన్ని, రెయిన్ గన్‌ల వినియోగాన్ని చేపట్టడమయింది. జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందినట్టి సూక్ష్మ సేద్యంపై శ్రద్ధ వహించడానికిగాను నీటి రక్షిత టెక్నాలజీపై దృష్టిసారిస్తుంది.

రాష్ట్రంలోని ఏడు ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం నా ప్రభుత్వ ప్రధాన అంశం. నా ప్రభుత్వం 2016, జూన్ నాటికి తోటపల్లి, పోలవరం కుడి ప్రధాన కాలువ, గాలేరు-నగరి మరియు హంద్రీనీవా, 2017 జూన్ నాటికి వంశధార 2వ దశ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ మరియు వెలిగొండ ప్రాజెక్టులు మరియు 2018, జూన్ నాటికి పోలవరం 1వ దశ పనులను పూర్తి చేయాలన్న నిబద్ధతతో ఉంది. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న మొదటి నిర్ణయాలలో ఒకటిగా ఉన్న పోలవరం ముంపు క్రిందకు వచ్చే ఏడు మండలాలను బదిలీ చేయాలన్న నిర్ణయం వల్ల పోలవరం ప్రాజెక్టు ఆచరణ సాధ్యమయింది. పట్టిసీమ ఎత్తిపోతల సాగునీటి పథకం ముందెన్నడూ లేని విధంగా విశిష్ట కృషితో 5 1/2 నెలల రికార్డు సమయంలో గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తూ ఆయా ప్రాంతాలలో ప్రస్తుత పంటలను సంరక్షించేందుకు కృష్ణా డెల్టాకు 8 టిఎంసిల నీటిని తీసుకొనిరావడానికి వీలు కల్పించింది. వృధాగా సముద్రంలో కలిసిపోయే గోదావరి నీటిని 80 టిఎంసిలకు తక్కువ కాకుండా కృష్ణా డెల్టాకు మళ్లించడం ఈ పథకం ఉద్దేశం. తద్వారా శ్రీశైలం జలాలను రాయలసీమ జిల్లాలకు కేటాయించడానికి వీలవుతుంది. నా ప్రభుత్వం రూ.134 కోట్లను ఖర్చు చేయడం ద్వారా అమలులో లేని 175 ఎత్తిపోతల సాగునీటి వ్యవస్థలన్నింటినీ పునరుద్ధరించింది. తద్వారా 1.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడమవుతున్నది. రాబోయే రోజులలో కృష్ణా, పెన్నా నదులను ఆ ప్రాంతంలోని రైతులకు ప్రయోజనాలను కల్పించడానికి వీలుగా అనుసంధానించడంపై దృష్టి పెడుతుంది.

నీరు-చెట్టు కార్యక్రమం క్రింద మరీ ముఖ్యంగా రాయలసీమలోని చిత్తూరు, కడప, అనంతపురము జిల్లాలలో చేపట్టిన పనులు, భూగర్భ జల మట్టాలలో గణనీయమయిన మెరుగుదల ఫలితాలనిచ్చాయి. జలవనరుల శాస్త్రీయ నిర్వహణకు భూగర్భ జల లభ్యతను అత్యంత ఉపయోగకరంగా ఉండే 1254 పీజోమీటర్ల ద్వారా రియల్‌టైం బేసిస్‌పై నా ప్రభుత్వం పర్యవేక్షిస్తున్నది.

రైతాంగం తన భూమిని సాగుచేసుకోవడంలో దోహదపడే మరో ముఖ్యమైన కార్యక్రమం "ఎన్‌టిఆర్ జల సిరి". 1వ దశ క్రింద, 50,000 మంది షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, చిన్న, సన్నకారు రైతులకు చెందిన 2.19 లక్షల ఎకరాల భూమికి సాగునీటిని అందించడమయింది. 2వ దశ క్రింద, సాగునీటి సదుపాయాలను పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాలలో 1.24 లక్షల బోరు బావులను మంజూరు చేయడమయింది.

జనాభాలోని దాదాపు 63 శాతం మందికి జీవనోపాధిని సమకూర్చే వ్యవసాయం దశాబ్దాలపాటు లాభదాయకతలేనిదిగానే కొనసాగుతున్నది. అన్ని పంటల ఉత్పాదకత స్థాయిలను పెంచే మా చర్యలు మంచి ఫలితాలను చూపిస్తున్నాయి. లోటు వర్షపాతం, రాష్ట్రంలోని కొన్ని భాగాలలో మునుపెన్నడూలేని భారీ వర్షాలు నమోదు అయినప్పటికీ పప్పుధాన్యాల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదలను చూపించింది. రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు రూ.24,500 కోట్ల చెల్లింపు బాధ్యతతో, అంతేగాక, ఉద్యానవన రైతులకు రూ.600 కోట్ల చెల్లింపు బాధ్యతతో నా ప్రభుత్వం రుణవిమోచన పథకాన్ని అమలుచేస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.7433.00 కోట్ల మొత్తాన్ని రైతులకు చెల్లించింది. రెండంకెల వృద్ధిని సాధించడం కోసం ప్రాథమిక రంగం క్రింద వృద్ధి చోదకాలలో ఒకటిగా మత్స్య పరిశ్రమ రంగాన్ని గుర్తించడమయింది. 974 కి.మీ.ల తీరప్రాంతం మరియు 6.00 లక్షల హెక్టార్లలో మంచి, ఉప్పు నీటి వనరులతో రాష్ట్రం మత్స్య పరిశ్రమల అభివృద్ధి కోసం అపరిమిత సామర్థ్యాన్ని కలిగివుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం చేపలు, రొయ్యల ఉత్పత్తి విలువలో మొదటి స్థానంలోనూ, సముద్ర సంబంధ చేపల ఉత్పత్తిలో నాల్గవ స్థానంలోనూ ఉంది. నా ప్రభుత్వం ప్రకటించిన "2015 - ఆంధ్రప్రదేశ్ మత్స్య పరిశ్రమల విధానం" ఆంధ్రప్రదేశ్‌ను "ఆక్వా హబ్ ఆఫ్ వరల్డ్" గా తీర్చిదిద్దడానికి ఉద్దేశించడమయింది.

పశుగణ సంపద రంగం మరొక కలిసికట్టుగా వృద్ధి చెందుతున్న రంగంగా ఉంది. 62.54 లక్షల పేద కుటుంబాలకు మద్దతును అందిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ప్రతి ఐదు గుడ్లలో ఒకదానిని ఉత్పత్తి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉంది. అంతేగాక, రాష్ట్రం దేశంలోనే మాంసం, పాలు అగ్రగామి ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉండి, దేశంలోని మొదటి మూడు రాష్ట్రాలలో ఒకటిగా మారాలని లక్ష్యంగా పెట్టుకొంది.

వృద్ధి ఫలాలు సమాజంలోని పేద మరియు అర్హమైన వర్గాలకు చేరే విధంగా చేయడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివుండి భావనల లక్ష్యాన్ని సాధించడానికి, కలగలిపిన సమగ్ర సేవలను ప్రారంభించడమయింది. ఇ-పోస్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని దాదాపు 4 కోట్ల మంది లబ్దిదారులకు లబ్దిని చేకూర్చుతూ 136 లక్షల మంది రేషన్ కార్డుదారులకు తలసరి ఒక్కొంటికి 5 కిలోల బియ్యాన్ని సరఫరా చేయడమనేది దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో అగ్రగామి మార్పుగా ఉన్నది. "ఎన్‌టిఆర్ భరోసా" క్రింద దాదాపు 43 లక్షల మంది పింఛనుదారులకు నెలకు రూ.1000/-ల పింఛనును క్రమంతప్పకుండా మొదటివారంలో తప్పనిసరిగా అందించడమవుతున్నది. వికలాంగులు నెలకు రూ.1500/-లు అందుకుంటున్నారు. దీపం పథకం క్రింద గణనీయంగా 11 లక్షల గ్యాస్ కనెక్షన్లను ఇవ్వడమయింది. మిగిలిన ప్రతి పేద కుటుంబానికి 2017, మార్చి నాటికి కనెక్షన్లను సమకూర్చడమవుతుంది.

ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, అల్పసంఖ్యాక వర్గాలు, మహిళల సంక్షేమం మా కార్యక్రమాలలో అగ్రభాగాన ఉన్నది. ఎస్‌సి ఉప-ప్రణాళిక, ఎస్‌టి ఉప-ప్రణాళిక మరియు బిసి ఉప-ప్రణాళికలో మొత్తం వ్యయం వరుసగా రూ. 5878 కోట్లు, రూ. 1904 కోట్లు మరియు రూ.6640 కోట్లుగా ఉంది. ఉప-ప్రణాళికలు పూర్తిగా అమలు అయ్యే విధంగా చేయడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. విద్యార్థులకు కలిగిన కష్టాలను తగ్గించడానికి ఉపకార వేతనాన్ని వార్షిక చెల్లింపులకు బదులుగా ప్రభుత్వం త్వరలో నెలవారీ చెల్లింపు పద్ధతికి మార్చనున్నది. హాజరును పర్యవేక్షించి తద్వారా జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి సంక్షేమ వసతి గృహాలలో బయో మెట్రిక్స్‌ను ప్రవేశపెడుతున్నాం. సంక్షేమ శాఖలలో బ్యాంకు అనుమతించదగిన సబ్సిడీ పథకాలు,

సంపద సృష్టిలో ముఖ్యమైన వనరుగా ఉన్నాయి. పటిష్టంగా అమలు చేసే క్రమంలో సృష్టించిన ఆస్తులకు నా ప్రభుత్వం త్వరలోనే జియో-టాగింగ్‌ను ప్రారంభిస్తుంది. ఎస్‌సి/ ఎస్‌టి/ బిసి / అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించే విధంగా చేయడానికి, అన్ని వసతి గృహాలను నైవాసిక పాఠశాలలుగా స్థాయిని పెంచే ఒక విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. నైపుణ్య శిక్షణ, సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరయ్యే వారికి శిక్షణకు బాధ్యత వహించడం, విదేశాలలో విద్యనభ్యసించడానికి ప్రతిభావంతులైన విద్యార్థులకు బాధ్యతవహించడం అనేవి ఉప-ప్రణాళిక క్రింద చేపట్టిన కొన్ని ముఖ్యమైన పథకాలు. బి.సి కులాలలోని గ్రామీణ చేతివృత్తుల వారికి ఆదాయం కలిగించే కార్యకలాపాలకు చేయూతనివ్వడానికి పలు నూతన పథకాలను ప్రారంభించడమవుతుంది. రానున్న నెలల్లో నా ప్రభుత్వం ఉప-ప్రణాళికను మరింత పటిష్టపరచి పేదరికాన్ని నిర్మూలించడానికి ధనాన్ని వినియోగిస్తూ నిరుపేద వర్గాలకు మంచి జీవన ప్రమాణాలు ఉండే విధంగా కట్టుదిట్టం చేస్తుంది.

బిసిల ప్రయోజనాలు దెబ్బతినకుండా కాపు / బలిజ / ఒంటరి / తెలగ కులాలకు రిజర్వేషన్‌ను కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం జస్టిస్ మంజునాథ్ కమీషన్‌ను నియమించడమయింది. ఎనిమిది నెలలలోపు నివేదిక సమర్పిస్తుందని ఆశించడమయింది.

కాపు / బలిజ / ఒంటరి / తెలగ కులాలలోని పేద కుటుంబాలకు ఆదాయకల్పన కార్యకలాపాలకు చేయూత నివ్వడానికి చరిత్రలో మొదటిసారిగా కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమయింది. రానున్న బడ్జెట్‌లో ఇందుకోసం రూ.1000 కోట్లను కేటాయించడమవుతుంది. అదేరీతిగా, బ్రాహ్మణ కులాలలోని పేదలకు సహాయం చేయడానికి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమయింది. రజక కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే అభ్యర్థన మరియు వాల్మీకి కులాన్ని షెడ్యూల్డ్ తరగతుల కేటగిరీ జాబితాలో చేర్చాలనే అభ్యర్థనను కొన్ని ఇతర రాష్ట్రాలలో వారు ఇప్పటికే ఇదే విధమైన హోదాను అనుభవిస్తున్నందువలన నా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. చేనేత కులాల ప్రయోజనం నా ప్రభుత్వానికి సర్వోన్నత ప్రాముఖ్యతగా ఉన్నది. వారి రుణమాఫీ నిమిత్తం రూ.110.96 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం కోసం దుకాన్-మకాన్, రోష్ని, దుల్హన్ మరియు షాదీఖానా వంటి పలు పథకాలను నా ప్రభుత్వం అమలుచేస్తున్నది. కడప, విజయవాడలలో హజ్‌హౌస్‌లను నిర్మించడమవుతుంది. కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయం కోసం ఇదివరకే శంకుస్థాపన చేయడమయింది. రానున్న విద్యా సంవత్సరంలో తరగతులను ప్రారంభించడానికి చర్యలు కొనసాగుతున్నాయి. ముస్లింల రిజర్వేషన్ కోసం నా ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది. ఉన్నత న్యాయ స్థానంలో కేసులను రక్షించడానికి మంచి న్యాయ కోవిదులను నియమించుకోవడమవుతున్నది.

జీవనోపాదికి మద్దతును అందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ మహిళా సాధికారత సంస్థ, మహిళ సాధికారత దిశగా పనిచేస్తున్నది. చంద్రన్న చేయూత క్రింద ఒక్కొక్క సభ్యురాలికి రూ.10,000/- చొప్పున 84 లక్షలకు పైగా మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.8400 కోట్ల మొత్తాన్ని పెట్టుబడి మూలధనంగా మంజూరు చేయడమయింది. ఇందులో, మొదటి దశలో 81.25 లక్షల గ్రామీణ మరియు పట్టణ స్వయం సహాయక బృందాలకు రూ.2423.35 కోట్లను విడుదల చేయడమయింది. "వడ్డీ విమోచన నిధి" నిమిత్తం రూ.1338.83 కోట్ల అదనపు విడుదలతో మూలధన సహాయం మొత్తం రూ.10298.63 కోట్లకు చేరింది. మహిళల జీవనోపాదులను మెరుగుపరచడానికి వినూత్న పద్ధతులతో వారికి సాధికారతను కల్పిస్తూ మహిళా రక్షణ, భద్రతను కల్పించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళా బృందాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రఖ్యాత కంపెనీలతో భాగస్వామ్యాలను కుదుర్చుకోవడం ద్వారా వాటిని ఆన్‌లైన్‌లో మార్కెట్ చేసుకోవడానికి వీలుగా వాణిజ్య ముద్రవేయడం జరుగుతున్నది. తద్వారా వారికి పెద్ద వ్యాపారవేత్తలనే హోదాను కల్పించడమవుతుంది.

ఉపాధి పొందగలిగే నైపుణ్యాలను బోధించడం ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉండే విధంగా చేయడానికి ముందస్తు ఆవశ్యకత నైపుణ్య అభివృద్ధి అని నా ప్రభుత్వం భావిస్తున్నది. నైపుణ్య అభివృద్ధిపై మరియు ఆర్థిక కార్యకలాపంపై దృష్టిసారిస్తూ, ఒక సమగ్ర యువత సాధికారత విధానం ఆలోచనలో ఉన్నది. వచ్చే సంవత్సరం దీనికోసం రూ.500 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమవుతుంది. యువతకు నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడానికి నైపుణ్య అభివృద్ధి సంస్థ మరియు సీమెన్స్, ఇండియన్

బిజినెస్ స్కూల్ వంటి ప్రఖ్యాత సంస్థలు మరియు ఇతర ప్రముఖ సంస్థల మధ్య భాగస్వామ్యం కుదుర్చుకొని ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఇంకనూ ఆరోగ్యదాయకంగా జీవించడానికి రాష్ట్ర యువతలో క్రీడా సంస్కృతికి సాయపడుతూ, 2019లో మన రాష్ట్రంలో జరగడానికి నిర్ణయించబడిన జాతీయ క్రీడలలో వారు పాల్గొనాలని అభిలషించి ప్రోత్సహిస్తున్నది.

ఆరోగ్య రంగానికి నా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నది. ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద ఆరోగ్య బీమా వర్తింపును ఒక్కో కుటుంబానికి ఇదివరకే రూ.2.5 లక్షలకు పెంచడమయింది. ఇంకనూ, ఎన్‌టిఆర్ వైద్య పరీక్ష క్రింద ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత రోగ నిర్ధారణ సేవలు అందించే నూతన చర్య మరియు తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ క్రింద ప్రసూతి సహాయక సేవలు మరియు 102 కాల్‌సెంటర్ ప్రజల నుండి విస్తృతమైన ప్రశంసలు అందుకున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య పరికరాల నిర్వహణను, వాటి వినియోగాన్ని గరిష్టతరం చేయడానికి పిపిపి నమూనాపై ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వడమయింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎయిమ్స్‌ను కేటాయించింది. ఇటీవల మంగళగిరి వద్ద శంకుస్థాపన చేయడమయింది. పై అన్ని చర్యలు, రాష్ట్రంలోని పౌరులకు మెరుగైన ఆరోగ్య రక్షణ సౌకర్యాలను అందిస్తాయి.

సుస్థిరమైన అభివృద్ధికి విద్య ఒక కీలకమైన అంశంగా నా ప్రభుత్వం గుర్తించి, అందరికీ విద్యను వాస్తవం చేయడానికి చర్యలను చేపడుతున్నది. సర్వశిక్షా అభియాన్ మరియు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) క్రింద ప్రాధాన్యతపై పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను పటిష్టపరచడాన్ని చేపట్టడమయింది. విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం నిర్వహించే అన్ని పాఠశాలల్లో డిజిటల్ విషయాంశంతో నా ప్రభుత్వం దశలవారీగా డిజిటల్ తరగతి గదులను ప్రవేశపెడుతున్నది.

2019-20 నాటికి రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలని నా ప్రభుత్వం భావిస్తున్నది. 2014, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్నత విద్యారంగంలో 7 ప్రధాన జాతీయ సంస్థలను మంజూరు

చేయడమయింది. 7 ఇన్‌స్టిట్యూట్లలోని 5 ఇన్‌స్టిట్యూట్లలో ఐఐటి తిరుపతి, ఐఐఎస్ఇఆర్ తిరుపతి, ఐఐఎం వైజాగ్, ఎన్ఐటి తాడేపల్లి గూడెం, ఐఐఐటి కర్నూలులలో ఇప్పటికే విద్యాసంబంధ కోర్సులను ప్రారంభించడమయింది. ఉన్నత విద్యలో అగ్రగామి ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్లు రాష్ట్రంలో ప్రవేశం కోసం మార్గాన్ని సుగమం చేస్తూ రాష్ట్ర శాసనసభ ఒక విశేషమైన చట్టాన్ని ఆమోదించింది. రాష్ట్రాన్ని ఒక విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడానికి పై అన్ని చర్యలను ఉద్దేశించడమయింది.

ఎంజిఎన్ఆర్ఇజిఎ ని అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండి, రాష్ట్రంలో ఈ పథకం క్రింద చేపట్టిన కార్యక్రమాలు దేశమంతటికీ నమూనాగా మారాయని, ఆ విషయాలను తాజా ఆర్థిక సర్వేలో పేర్కొనడమయింది. ఎంజిఎన్ఆర్ఇజిఎ కలయిక మరియు ఇతర నిధులతో, "వాడ వాడలో చంద్రన్న బాట" అనే పేరుతో గ్రామాలలో అంతర్గత సిమెంటు రోడ్లు వేయాలనే మహోన్నత కార్యక్రమాన్ని నా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఒక్క సంవత్సరంలోనే మొత్తం 2704 కి.మీ.ల పొడవున సిమెంటు రోడ్లను వేయడమయింది. "పంట సంజీవిని" క్రింద 8.75 లక్షల వ్యవసాయ సాగు కుంటలను నిర్మించాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. ఎంజిఎన్ఆర్ఇజిఎలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం క్రింద సుమారు 90 కోట్ల చెట్లను నాటడమయింది. ఈ పనితీరుకు గుర్తింపుగా 2014-15 సంవత్సరానికి ఎంజిఎన్ఆర్ఇజిఎ క్రింద పారదర్శక, జవాబుదారీ విధానంలో చేపట్టిన సమర్ధవంతమైన చొరవల కోసం ఆంధ్రప్రదేశ్ జాతీయ అవార్డును సాధించింది.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని గృహాలన్నింటికి వ్యక్తిగత గృహ కనెక్షన్ ద్వారా నీటిని సరఫరా చేయడమే నా ప్రభుత్వ దార్శనికతగా ఉంది. మొత్తం 48,206 జనావాసాలకుగాను, 18,057 జనావాసాలకు పూర్తిగా వర్తింపు చేయడమయింది. (55 ఎల్‌పిసిడి), 29,555 జనావాసాలకు పాక్షికంగా వర్తింపు చేయడమయింది. మిగిలిన 594 జనావాసాలు నీటి కొరతను (నాణ్యతా లోపం స్థితితో) ఎదుర్కొంటున్నాయి. కొత్త పథకాలను మంజూరు చేయడం, పని చేయని పథకాలన్నింటిని పునరుద్ధరించడం ద్వారా ప్రతి పంచాయతీకి, ప్రతి మునిసిపాలిటీకి, ప్రతి కుటుంబానికి సురక్షితమైన, త్రాగదగిన మంచినీటిని సమకూర్చాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. త్రాగునీటి నాణ్యత సమస్యను

పరిష్కరించడానికి, రూ.2/-లకు 20లీటర్ల త్రాగునీటిని సమకూర్చేందుకు "ఎన్‌టిఆర్ సుజల పథకం" విధానం క్రింద 728 జనావాసాలను వర్తింపులోకి తీసుకొనిరావడమయింది. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద 2019 నాటికి అన్ని గ్రామాలనూ బహిరంగ విసర్జన రహిత గ్రామాలుగా రూపొందించాలని కూడా ఉద్దేశించడమయింది. 2015-16లో, 2.82 లక్షల "ఐహెచ్‌హెచ్‌ఎల్" లను పూర్తి చేయడమయింది. 4.49 లక్షల "ఐహెచ్‌హెచ్‌ఎల్" లు నిర్మాణంలో ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో, 82098 "ఐహెచ్‌హెచ్" మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి.

నా ప్రభుత్వం, 2022 నాటికి అందరికీ గృహాలను సమకూర్చేందుకు కట్టుబడి ఉంది. "ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం" క్రింద గ్రామీణ ప్రాంతాలలో రెండు లక్షల గృహాలను, అందరికీ గృహాలు (హెచ్‌ఎఫ్‌ఎ) పథకం క్రింద పట్టణ ప్రాంతాలలో మరో రెండు లక్షల గృహాలను మంజూరు చేయడమయింది. గృహనిర్మాణం అనేది ఒక ఆర్థిక సంబంధ కార్యకలాపం అయినందున, ఈ పథకాన్ని ఒక ప్రధాన వృద్ధి చోదకంగానూ, ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావం కలిగి వుండేదిగానూ గుర్తించడమయింది. గృహాలను పూర్తి చేయడానికి లబ్ధిదారులకు తగినంత మొత్తాన్ని అందుబాటులో ఉంచేందుకు నా ప్రభుత్వం గ్రామీణ గృహనిర్మాణ యూనిట్ వ్యయాన్ని సాధారణ వర్గాలకు రూ.70,000/-లు, ఎస్.సి.లకు రూ.1,00,000/-ల నుండి అందరికీ సమానంగా ఉండే విధంగా రూ.2.75 లక్షలకు పెంచింది. అంతేకాకుండా, సబ్సిడీని కూడా సాధారణ వర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ.1.25 లక్షలకు, ఎస్‌సి / ఎస్‌టి లబ్ధిదారులకు రూ.1.75 లక్షలకు పెంచింది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం లబ్ధిదారునికి రుణంగా ఏర్పాటు చేయడమవుతున్నది. అన్ని గృహాలకు టైల్స్‌తో ఫ్లోరింగ్ చేయడం, కిచెన్ ప్లాట్ ఫామ్, మెట్లు, పిట్టగోడ మొదలైనటువంటి అదనపు సౌకర్యాలను ప్రతిపాదించడమయింది. వ్యక్తిగత గృహాలకు ప్రభుత్వం సమకూర్చిన మొత్తంలో మునుపెన్నడూ పెంచనంత అత్యధిక మొత్తాన్ని పెంచడమయింది.

సమర్థవంతమైన ఇసుక విధానం మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, నిర్మాణ కార్యకలాపానికి ప్రేరణనిస్తున్నది. సామాన్యులకు ఇసుక సులభంగా లభ్యమయ్యేటట్లు చూడటానికి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి

అనుకూలమైన వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతోనూ, నిర్మాణ కార్యకలాపాల ద్వారా ఉపాధి అవకాశాలను పెంచేందుకు నా ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతి పౌరునికి ఇసుకను అధీకృత ఇసుక క్వారీల నుండి ఉచితంగా సేకరించుకోవడానికి అనుమతించింది. ఈ విధానం దేశంలోనే మొట్టమొదటిది మరియు సామాన్యుని స్వంత ఇంటి కలను నిజం చేయడానికి వీలుకల్పిస్తుంది.

నా ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే నిమిత్తం ప్రజలు, ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యంతో 20 బదలాయించదగని బాధ్యతలతో "ఆకర్షణీయ గ్రామం - ఆకర్షణీయ వార్డు" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో పాలుపంచుకొనేందుకు 14,000 మందికి పైగా భాగస్వాములు ఇప్పటికే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వారు బదలాయించదగని బాధ్యతలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నారు. నా ప్రభుత్వం "జన్మభూమి-మా ఊరు" అనే ప్రజా-కేంద్రీకృత అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వివిధ ప్రాధాన్యతా రంగాలపై శ్రద్ధవహిస్తూ కార్యక్రమాలను మూడు దఫాలుగా నిర్వహించడమయింది. "ఆకర్షణీయ గ్రామం - ఆకర్షణీయ వార్డు" అనే అంశం ప్రధాన అంశంగా 2016, జనవరిలో 3వ దఫా కార్యక్రమాన్ని నిర్వహించడమయింది. గ్రామాలను / వార్డులను దత్తత తీసుకొంటూ అంగీకరించిన భాగస్వాములతో కలిసి పనిచేయడం ద్వారా కార్యక్రమంలో ప్రాధాన్యతనిచ్చిన బదలాయించదగని బాధ్యతలను నెరవేర్చేందుకు "స్మార్ట్ ఏపి ఫౌండేషన్" ను స్థాపించడమయింది.

విద్యుత్ రంగంలో చేపట్టిన చర్యల విషయంలో రాష్ట్రం మొత్తం దేశానికే ఆదర్శంగా మారింది. నా ప్రభుత్వం గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులందరికీ ఇరవై నాలుగు గంటలూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ 7 గంటల పాటు నాణ్యమైన, ఉచిత విద్యుత్‌ను అందించేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రం, 22.5 మిలియన్ యూనిట్ల లోటు విద్యుత్ నుండి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారింది. నా ప్రభుత్వం ఈ సంవత్సరంలో "ఎటి & సి" నష్టాలను 10.29 శాతానికి తగ్గించింది. వచ్చే సంవత్సరం నాటికి ఈ నష్టాన్ని సింగిల్ డిజిట్‌కు తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించింది. విద్యుత్‌ను

సంరక్షించేందుకు వీలుగా, నా ప్రభుత్వం గృహ వినియోగదారులందరికీ "ఎల్ఇడి" బల్బుల పంపిణీని చేపట్టి ఇప్పటివరకు 93.5 లక్షల కుటుంబాలకు దాదాపు 1.87 కోట్ల "ఎల్ఇడి" బల్బులను పంపిణీ చేసింది.

సామర్థ్యంలేని అన్ని వ్యవసాయ పంపుసెట్ల స్థానంలో ఇంధన సమర్థతతో కూడిన మరియు ఐఎస్ఐ పంపు సెట్లను దశలవారీగా సమకూర్చేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అంతేగాక, ప్రభుత్వం, రైతులకు 3,000 సోలార్ పంపు సెట్లను పంపిణీ చేసింది. 2016-17లో 20,000 సోలార్ పంపు సెట్లను పంపిణీ చేయాలనే కార్యక్రమాన్ని రూపొందించడమయింది. భారత ప్రభుత్వం ప్రారంభించిన 5 ఇంధన సామర్థ్య అవార్డులను అన్నింటినీ రాష్ట్రం గెలుచుకొందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. పునరుత్పాదక ఇంధనాన్ని రాష్ట్రం ప్రోత్సహిస్తున్నది మరియు 2016, ఏప్రిల్ నాటికి గ్రిడ్‌కు 619 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని జతచేయడమవుతుంది. నిరుపేదలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు 2016, జూన్ నాటికి రాష్ట్రంలో మిగిలిన 4.6 లక్షల కుటుంబాలకు విద్యుద్దీకరణను పూర్తి చేయాలనే కార్యక్రమాన్ని రూపొందించడమయింది.

భారతదేశపు "యాక్ట్ ఈస్ట్ పాలసీ" కి అనుగుణంగా 974 కి.మీ.ల పొడవైన తీరప్రాంతాన్ని వినియోగించుకోవడానికి వీలుగా "పోర్టు ఆధారిత" అభివృద్ధి నమూనాను నా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోని తూర్పు కోస్తాపై లాజిస్టిక్స్ హబ్‌గానూ, భారతదేశానికి "గేట్-వే" గానూ అభివృద్ధి చేసేందుకు బాగా అనువుగా ఉంది.

మన విమానాశ్రయాలు వార్షిక రాకపోకలలో గత సంవత్సరం కంటే 59 శాతం వృద్ధిని కనబరిచాయి. విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరంలలో ఉన్న ప్రస్తుత విమానాశ్రయాల విస్తరణ పనులు బాగా చురుకుగా జరుగుతున్నాయి. భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లు, నాగార్జున సాగర్, దొనకొండలలో 5 కొత్త విమానాశ్రయాలను చేపట్టాలని ప్రతిపాదించడమయింది.

ఫ్లోటింగ్ స్టోరేజి రీగ్యాసిఫికేషన్ యూనిట్ (ఎఫ్ఎస్ఆర్‌యు) పనులను, కాకినాడ నుండి విశాఖపట్టణానికి గ్యాస్ పైప్ లైను పనులను 2016-17 లో ప్రారంభించడమవుతుంది. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో నగర గ్యాస్ పంపిణీ పనిని 2016-17లో చేపట్టడమవుతుంది.

నాలుగు లైన్లు లేదా ఆరు లైన్ల రోడ్డు ద్వారా అన్ని జిల్లాల ప్రధాన కార్యస్థానాల నుండి రాష్ట్ర రాజధానికి రోడ్డు అనుసంధానతను అభివృద్ధి చేయడంపై నా ప్రభుత్వం దృష్టిసారిస్తున్నది. అంతేగాక, అన్ని ప్రధాన ఓడరేవులు, పర్యాటక ప్రదేశాలు, పారిశ్రామిక హబ్‌లకు, సమీప జాతీయ రహదారులకు రోడ్డు అనుసంధానతను సమకూర్చడానికి, అన్ని వాతావరణాలకు తట్టుకొనే రెండు లైన్ల రోడ్డుతో అన్ని మండల ప్రధాన కార్యస్థానాలనూ జిల్లా ప్రధాన కార్యస్థానాలతో అనుసంధానించడానికి కూడా మేము కట్టుబడి ఉన్నాం.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ సహాయంతో దాదాపు రూ.70,000 కోట్ల అంచనా వ్యయంతో జాతీయ రహదారుల భారీ విస్తరణ కార్యక్రమాన్ని ఆరంభించింది. 1250 కి.మీ.ల రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా ప్రకటించడమయింది.

కర్నూలు, కడప జిల్లాలకు అనుసంధానిస్తూ అనంతపురము మీదుగా అమరావతి, బెంగుళూరు మధ్య ఎక్స్‌ప్రెస్‌వేను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఇది రాయలసీమ నుండి రాష్ట్ర రాజధాని అమరావతికి సత్వర సంభవనీయ అనుసంధానానికి వీలు కలిగిస్తుంది.

నా ప్రభుత్వం భారతీయ నావికాదళ భాగస్వామ్యంతో విశాఖపట్టణంలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాలు పాల్గొన్నాయి. అమెరికా, ఇంగ్లాండ్, చైనా, రష్యాల నావికాదళాలతోపాటు అతి పెద్ద నావికాదళాలు కలిసి మొట్టమొదటిసారి కవాతులో పాల్గొనడం దేశానికే గర్వకారణం. సురక్షిత నౌకాయాన భవిష్యత్తు కోసం శాంతి, సహకారం, స్నేహతత్వాన్ని ప్రోత్సహించి, భాగస్వామ్యాలను పెంపొందించడానికి కూడా సముద్రాలను వినియోగించుకోవచ్చుననే సందేశాన్ని ఈ ఫ్లీట్ రివ్యూ తెలియజేసింది.

పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన పరిశ్రమలు ప్రపంచవ్యాప్తంగా పోటీపడేటట్లు చేయడానికి ఉత్తమ విధాన పత్రాలను, ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రతిపాదించడమయింది. పెట్టుబడులు వచ్చేటట్లు చూడడానికి నా ప్రభుత్వం భూమి, నీరు, విద్యుత్తు, పరిపాలన, కార్మిక రంగాలలో ఆకర్షణీయ విధానాలను ఆచరణలో పెట్టింది. వ్యాపారాన్ని సులభంగా నిర్వహించే రాష్ట్రాలలో నా ప్రభుత్వం రెండవ స్థానాన్ని పొందింది. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి చైనా, జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ వంటి దేశాల నుండి వివిధ ప్రభుత్వ, వ్యాపార ప్రతినిధి వర్గాలు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించాయి. నా ప్రభుత్వం కూడా విశాఖపట్టణంలో 2016, జనవరిలో మొదటి సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్‌ను నిర్వహించింది. 41 దేశాల నుండి 300 మంది విదేశీ ప్రతినిధులతో సహా ఈ సదస్సులో 1400 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు సంబంధించి రూ.4.67 లక్షల కోట్ల విలువ గల మొత్తం 328 ఎంఓయులు ఈ సదస్సులో అనుసంధానమయ్యాయి.

నా ప్రభుత్వం ముఖ్యమైన వృద్ధి చోదకాలలో ఒకటిగా ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని గుర్తించి, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం రాష్ట్రాన్ని అత్యంత అనుకూల గమ్యస్థానంగా రూపొందించాలనే లక్ష్యంతో ఆకర్షణీయ ప్రోత్సాహకాలతో 2015-16 నూతన ఆహార ప్రాసెసింగ్ విధానాన్ని ప్రకటించింది. వ్యవసాయం కోసం నూతన దార్శనికత క్రింద పంట కోత పూర్వ, అనంతర సాంకేతిక విజ్ఞానాల ద్వారా ఫార్వార్డ్ & బ్యాక్వార్డ్ ఏకీకరణను సాధించడానికి ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల నుండి మద్దతు మరియు భాగస్వామ్యంతో గుర్తించిన 25 సరకులకు బ్రాండు కల్పిస్తూ నా ప్రభుత్వం ప్రపంచ ఆర్థిక ఫోరంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

పర్యాటక రంగాన్ని ముఖ్యమైన వృద్ధి చోదకాలలో ఒకటిగా గుర్తించడమయింది. నా ప్రభుత్వం 2015-16 పర్యాటక విధానాన్ని ప్రకటించింది. 2015లో వరల్డ్ ట్రావెల్ టూరిజం కౌన్సిల్ దీనికి ఉత్తమ విధానం అవార్డును ఇచ్చింది. ఈ విధానాన్ని ప్రారంభించినప్పటి నుండి ఈ రంగానికి సంబంధించి దాదాపు రూ.11,000 కోట్ల విలువ గల పెట్టుబడులను రాబట్టడమయింది. పర్యాటక రంగం 2020 నాటికి 5 లక్షల అదనపు ఉద్యోగాలను కల్పిస్తుందని ఆశించడమయింది.

రాష్ట్ర సంప్రదాయం, సంస్కృతిని పెంపొందించడానికి, కూచిపూడి గ్రామంలో కూచిపూడి నాట్యారామం అనే విశిష్ట భవనాన్ని నిర్మించాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది. భవిష్యత్ తరాల ప్రయోజనం కోసం శతాబ్దాల పురాతన కూచిపూడి నాట్యరీతి గొప్పతనాన్ని ప్రదర్శించడానికి అత్యంత అధునాతన మల్టీ మీడియాను మరియు డిజిటల్ టెక్నాలజీని వినియోగించడమవుతుంది.

పట్టణీకరణను ఒక చోదక శక్తిగా గుర్తిస్తూ, నా ప్రభుత్వం ఉత్తమ నివాస యోగ్యం కోసం రాష్ట్రంలోని నగరాలు మరియు పట్టణాలను అందమైన, పరిశుభ్రమైన, చెత్తరహిత పట్టణ జనావాసాలుగా రూపాంతరీకరించాలనే దార్శనికతను రూపొందించింది. రాష్ట్రంలోని ముప్పై ఒక్క పట్టణ స్థానిక సంస్థలు అటల్ రిజువనేషన్ మరియు అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (అమృత్) అనే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకంలో స్థానం సంపాదించాయి. "ఆకర్షణీయ నగరాలు" ప్రాజెక్టు క్రింద ఆకర్షణీయ నగరాలుగా విశాఖపట్టణం, కాకినాడ నగరాలు ఎంపిక అయ్యాయి. తరువాతి సంవత్సరం తిరుపతి నగరాన్ని ఆకర్షణీయ నగరంగా ఎంపిక చేయడమవుతుంది. కర్నూలును ఆకర్షణీయ నగరంగా అభివృద్ధి చేయడానికి నా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందునిమిత్తం తొలుత రూ.100 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమవుతుంది.

ఒక సంవత్సరం క్రితం హుద్‌హుద్ తుఫాను కారణంగా విధ్వంసమైన విశాఖపట్టణం నగరం ఈనాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల క్రింద దేశంలోనే అయిదవ స్థానాన్ని పొందింది. నా ప్రభుత్వం యొక్క నిర్విరామ చర్యలకు ఇది నిదర్శనం. విజయవాడ మెట్రోను 3 సంవత్సరాలలో పూర్తి చేయడమవుతుంది. త్వరలో విశాఖపట్టణం మెట్రోను ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించడమవుతుంది.

నూతన రాజధాని అమరావతి ప్రపంచ శ్రేణి ప్రజా రాజధానిగా ఉండబోతున్నది. నాయకత్వం పై విశ్వాసం ఉంచి, రాజధాని నగర నిర్మాణం కోసం వారి స్వంత భూమిని స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకు వచ్చిన అమరావతి ప్రాంత రైతులకు నా ప్రభుత్వం ధన్యవాదాలను తెలుపుతున్నది. నిర్ణీత కాలపరిమితిలో ఉచితంగా బృహత్ ప్రణాళికను

రూపొందించడంలో సింగపూరు ప్రభుత్వం అందించిన మద్ధతు ప్రత్యేక ప్రశంసలు పొందడానికి అర్హ మైనది. ఉత్తమ వాస్తు శిల్ప సంస్థల ఎంపిక, వాస్తు శిల్ప ప్రణాళిక తయారీ ప్రాసెసులో ఉంది. దేశం లోపల, వెలుపల నుండి అనేక ప్రసిద్ధ కంపెనీలు నూతన రాజధానిలో తమ వెంచర్లను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నాయి. నా ప్రభుత్వం మొత్తం రాష్ట్రాన్ని సుసంపన్నత వైపు నడిపించే ఆర్థిక అధికార కేంద్రం పాత్రను పోషించగలిగే ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించగలదన్న నమ్మకంతో ఉంది.

నా ప్రభుత్వం పౌర కేంద్రీకృత ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టులను అమలుచేస్తున్నది. తద్వారా పౌరులు ఎక్కడినుండైనా సమర్ధవంతంగా మరియు పారదర్శక విధానంలో ఇ-సేవలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఇ-తాల్ పోర్టల్ ప్రకారంగా ఇ-సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా సమాచారం అందించడం ద్వారా పౌరులకు ఏకీకృత సర్వీసులను సమకూర్చే ఒక భారీ కార్యక్రమమైనట్టి ఇ-గవర్నెన్స్ అథారిటీ క్రింద ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్, ఇ-ప్రగతిని ప్రవేశపెట్టడానికి మరియు నైపుణ్యం, సమర్ధత, పారదర్శక లక్షణాలు గల సుపరిపాలన శకాన్ని ప్రారంభించడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

భూముల విక్రయం, కొనుగోలులో అవకతవకలు మరియు అవినీతిని నిర్మూలించాలనే దృష్టితో నా ప్రభుత్వం ఉద్యమ విధానంలో భూమి రికార్డుల డేటాను సరిచేయాలనే లక్ష్యంతో ఐటి ఆధారిత "మీ ఇంటికి - మీ భూమి" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం క్రింద దాదాపు 72.15 లక్షల మంది పట్టాదారుల భూమి రికార్డులను తాజాపరచడమయింది. గ్రామీణ భూ సంబంధ పట్టాలన్నింటి డిజిటలైజేషను పూర్తి అయింది. భౌగోళిక సంబంధిత మరియు పుస్తక ఆధారిత, అంతరిక్ష డేటా ఏకీకరణను చేపట్టడానికి నా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

సర్వీసు బట్వాడాను మెరుగుపరచడానికి, అవినీతిని నిర్మూలించడానికి నా ప్రభుత్వం జి2సి, జి2బి, జి2జి లావాదేవీలన్నింటిలో ఐటి సొల్యూషన్‌లను అనుసరిస్తున్నది. వాస్తవ కాల ప్రాతిపదికన సమాచారాన్ని తాజాపరచడానికి పెక్కు

శాఖలు ట్యాబ్‌లను సమకూర్చాయి. సర్వీసు బట్వాడాలో బయో మెట్రిక్‌లు, ఇ-పోస్ (పిఓఎస్) మరియు ట్యాబ్‌లను వినియోగిస్తున్నందున వివిధ వర్గాల నుండి ప్రశంసలను అందుకోవడమయింది మరియు కేంద్ర ప్రభుత్వం మన విధానాన్ని ఇతర రాష్ట్రాలకు సిఫారసు చేస్తున్నది.

నా ప్రభుత్వం సముచిత విధానాలను తీసుకొనిరావడం మరియు ప్రోత్సాహకాలను సమకూర్చడం ద్వారా అంకుర సంస్థలను ప్రోత్సహిస్తున్నది. రాబోయే సంవత్సరాలలో, రాష్ట్రం అనేక విజయవంతమైన అంకుర కంపెనీలకు నెలవుగా ఉంటుంది.

నా ప్రభుత్వం 2016లో అన్ని కుటుంబాలకు 10-15 ఎంబిపిఎస్ అనుసంధానాన్ని సమకూర్చడానికి ఎపి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేస్తున్నది. దీనిని కేవలం నెలకు రూ.150/-ల చెల్లింపుతో కేబుల్ టివి, ఇంటర్ నెట్ మరియు టెలిఫోను అనుసంధాన సేవల ప్యాకేజీని సమకూర్చడం ద్వారా దాదాపు 1.30 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాలని ఉద్దేశించడమయింది.

నా ప్రభుత్వం అన్ని స్థాయిలలో అవినీతిని నిర్మూలించాలని కృతనిశ్చయంతో ఉంది. ఇటీవల అవినీతి ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తిని జప్తు చేయడానికి కఠినమైన నిబంధనలతో ప్రత్యేక కోర్టుల బిల్లును ఆమోదించింది.

మొత్తం మీద, ప్రజలందరూ శాంతితో, సుఖసంతోషాలతో ఉండేలా చూడటానికి నా ప్రభుత్వం నిబద్ధతతో ఉంది. రాష్ట్ర చరిత్రలో మనం సంక్షోభంలో ఉన్నప్పటికీ ఎదుర్కొన్న సవాళ్ల దశను, రాబోయే తరాలు సమర్థిస్తాయి. ఈ విషయంలో నా ప్రభుత్వం పూర్తి అవగాహనను కలిగి ఉండటంతోపాటు నిర్దేశించుకొన్న అన్ని లక్ష్యాలను నెరవేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తుంది.

స్వామి వివేకానంద మాటలతో ఈ ప్రసంగాన్ని ముగించాలనుకుంటున్నాను.

" మన స్థితికి మనమే బాధ్యులం ;
మనం ఎలా ఉండాలనుకుంటామో అలాగే ఉంటాం ;
మనల్ని మనం తీర్చిదిద్దుకొనే శక్తి మనకుంది ;
మన గత చర్యల ఫలితమే మన ఇప్పటి పరిస్థితి అయినట్లయితే,
ప్రస్తుత మన చర్యలను బట్టే భవిష్యత్తులో
మనం ఎలా ఉండబోయేది అవగతమవుతుంది.
కాబట్టి, మనం ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలి "

**జైహింద్**

Printed by the Commissioner of Printing, at A.P. Legislative Assembly Printing Press, Hyderabad, 2016.